
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 13 । జూలై । 2024



సోమశిలలో 9.939 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 9.939 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు నుంచి 117 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.75,430
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,774
3 శాతం జీఎస్టీతో	రూ.6,977
నవర (8 గ్రా)	రూ.55,816

గరిష్టం/కనిష్టం 37.5 /27.2

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా ఉండి అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. వాతావరణంలో తేమ 58 శాతం ఉంది.

న్యూస్‌రీల్

రేపు సోమశిలకు మంత్రుల రాక

సోమశిల: సోమశిల జలాశయానికి సంబంధించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ ఆదివారం రానున్నారు. అనంతరం సోమేశ్వరాలయం, కండలేరు రిజర్వాయర్‌ను మంత్రులు పరిశీలించాక కండలేరు జలాశయ అతిథి భవనంలో జలవనరులశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ప్రధానంగా సోమశిల ఆప్రాన్, రక్షణ గోడ, నిర్మాణ పనులు, మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసేలా మంత్రులు జలవనరులశాఖ మంత్రికి వివరించనున్నారు.

సమగ్ర నివేదికలను సిద్ధం చేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): సోమశిల, కండలేరు జలాశయాలతో పాటు తెలుగుగంగ ప్రాజెక్ట్‌ల స్థితిగతులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయిలో నివేదికలు సిద్ధం చేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆదివారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సోమశిల ప్రాజెక్ట్ ఎస్‌ఈ బీవీ రమణారెడ్డి, జలవనరులశాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్, కండలేరు జలాశయం ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఆవులకు చర్మవ్యాధి నివారణ టీకాలు

నెల్లూరు (సెంట్రల్): ఆవుల్లో ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలను ఈ నెల 20వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఉచితంగా వేస్తున్నట్లు పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ జ్ఞానచైతన్య కిశోర్ తెలిపారు. నెల్లూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 57 వేల తెల్ల ఆవులు, దూడలు గుర్తించి ఈ వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. ప్రస్తుతం గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు కూడా వేస్తున్నట్లు పేర్కొన్నారు. నీలి నాలుక వ్యాధి గొర్రెల్లో చాలా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఇది అంటువ్యాధి అని, ఒక దాని నుంచి మరొక దానికి సోకుతుందన్నారు. గొర్రెల పెంపకదారులు తప్పకుండా నీలి నాలుక టీకాలు వేయించాలని సూచించారు. ఒకసారి ఈ టీకా వేసిన నెల తర్వాత మరొక డోస్ వేయాల్సి వస్తుందన్నారు. జిల్లాలో 5.56 లక్షల గొర్రెలకు ఈ టీకాలు వేస్తున్నట్లు వివరించారు.

అందుబాటు ధరలకే బియ్యం, కందిపప్పు

- డీఎస్‌ఓ వెంకటరమణ



నగరంలోని సూపర్‌మార్కెట్లో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన డీఎస్‌ఓ

నెల్లూరు (పొగతోట): బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర ధరలను తగ్గించేలా చర్యలు తీసుకున్నామని డీఎస్‌ఓ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఫత్తేఖాన్‌పేట రైతుబజారులో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. డీఎస్‌ఓ మాట్లాడుతూ రైతు బజార్లు, డీమార్ట్, రిలయన్స్ సూపర్ మార్కెట్లో కందిపప్పు, బియ్యం తక్కువ ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. బియ్యం కేజీ రూ.40, కందిపప్పు రూ.160 చొప్పున ప్రజలకు విక్రయించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రాజీనామాలకు ఒత్తిడి

- అధికారులకు మొర పెట్టుకున్న వీఓఏలు

నెల్లూరు (పొగతోట): కావలి నియోజకవర్గంలోని పని చేస్తున్న వీఓఏలందరూ రాజీనామాలు చేసి వెళ్లిపోవాలంటూ టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారంటూ వీఓఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ సాంబశివారెడ్డిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఆయనకు సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. అనేక సంవత్సరాలుగా గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. అటువంటి తమను బలవంతంగా రాజీనామాలు చేసి వెళ్లిపోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు.

మలేరియా డేంజర్ బెల్స్



రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో డయేరియా విజృంభించి ప్రాణాంతకంగా మారింది. ఈ సీజనల్ వ్యాధి అదుపులోకి రాని పరిస్థితిలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్న నేపథ్యంలో తాజాగా జిల్లాలో మలేరియా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఇటీవల కాలంలో ప్రైవేట్ క్లినిక్స్, ఆస్పత్రుల్లో మలేరియా కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతుండడం గమనార్హం. అయితే జిల్లా వైద్యాధికారులు మాత్రం ఎక్కడా మలేరియా కేసులు నమోదు కాలేదంటూ బుకాయిస్తున్నారు. మలేరియా నివారణకు వినియోగించే మందులను ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవడంతో పాటు అవసరమయ్యే మందులను అందుబాటులో ఉంచుతుండేది.

సీజనల్ వాధ్యుల 'వైరల్'

➡ రెండు రోజుల క్రితం నెల్లూరు నగరం మన్సూర్‌నగర్‌లో ఒక వ్యక్తికి మలేరియా సోకింది. ఆస్పత్రిలో చేరి వైద్యం చేయించుకునే సరికి రూ.10 వేలకు పైగానే ఖర్చయింది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలలో 11 మలేరియా కేసులు నమోదయ్యాయి. జయభారత్ ఆస్పత్రిలో 4 కేసులు, నారాయణ, మెడికవర్ వంటి ఆస్పత్రుల్లోనూ పదుల సంఖ్యలో కేసుల నమోదైనట్లు తెలుస్తోంది. ఇలా మలేరియా బారిన పడిన బాధితులు ప్రైవేట్ వైద్యశాలల్లో చేరి వేలాది రూపాయలు వైద్యం కోసం ఖర్చు చేస్తున్నారు.

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసులు
- జిల్లాలో అందుబాటులో లేని క్వినైన్ మందులు
- మలేరియా కేసులు లేవంటూ బుకాయిస్తున్న వైద్యశాఖ
- దోమల నిర్మూలనతోనే మలేరియా అదుపు



నెల్లూరు నగరంలోని ఓ వీధిలో నిల్వ ఉన్న నీటిలో తుట్టెలు తుట్టెలుగా దోమలు

నెల్లూరు (అర్బన్): సార్వత్రిక ఎన్నికలు, ప్రభుత్వం మారడం వంటి పరిణామాలతో వైద్యారోగ్యశాఖలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్షలు, చర్యలు, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడింది. ఈ పరిణామాలతో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలి ప్రాణాలు తీస్తోంది. కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలమవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో జిల్లాలో మలేరియా కేసులు ప్రబలుతున్నా.. మరో వైపు ప్రైవేట్ ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో కేసులు నమోదవుతున్నా వైద్యశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టున్నారు. కేసుల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు అసలు మలేరియా కేసులే లేవంటూ కొట్టిపారేస్తున్నారు.

5 ఏళ్ల తర్వాత తాజాగా..

జిల్లాలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు నీరు ప్రజల ఆవాస పరిసరాల్లో గుంతల్లో నిలబడిపోతోంది. నెల్లూరు నగరంతో పాటు పట్టణాల్లో మురుగు కాల్వల పూడిక తీయకపోవడంతో నీరు ముందుకు కదలక దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో వీటి విజృంభణ ఎక్కువై మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. కొద్ది రోజులుగా జిల్లాలో మలేరియా కేసులు వెలుగు చూస్తున్నాయి. కొన్ని రకాల మలేరియా కేసులు ప్రాణాంతకం కాకపోయినా ఫాల్సిఫారమ్ వంటి కేసులు మాత్రం ప్రాణాంతకమేనని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. సకాలంలో వైద్య సేవలు అందకపోతే ప్రాణాలు వదులుకోవాల్సిందే. సరిగ్గా 5 ఏళ్ల క్రితం నెల్లూరు జిల్లాలో మలేరియా కేసులు రాష్ట్రంలోనే అధికంగా నమోదయ్యాయి. తర్వాత కాలంలో తగ్గినప్పటికీ మళ్లీ తాజాగా కేసుల నమోదు కనిపిస్తోంది.

గతంలో ప్రభుత్వ వైద్యశాలలు పటిష్టం

జిల్లాలో 52 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 28 పట్టణ ఆరోగ్యకేంద్రాలు, ఆత్మకూరులో జిల్లా ఆస్పత్రి, కావలి, కందుకూరులో ఏరియా ఆస్పత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా సర్వజన ఆస్పత్రి ఉంది. నెల క్రితం వరకు అధికారంలో ఉన్న అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లను నియమించడంతో పాటు 14 మందిని వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసింది. స్పెషాలిటీ వైద్య సేవలందించేందుకు 18 మంది డాక్టర్లను నియమించింది. ఈసీజీ, స్కానింగ్ వంటి పరీక్షలతో పాటు 70 రకాల పరీక్షలను అందుబాటులోకి తెచ్చింది. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతోనే 18 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను ఇంటికి సాగనింపి పేదలకు స్పెషాలిటీ వైద్య సేవలు పల్లె స్థాయిలో అందకుండా చేసింది.

మన ప్రాంతంలో రెండు రకాల కేసులు

మలేరియాలో ప్రధానంగా ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సిపారమ్, ప్లాస్మోడియం మలేరియా, ప్లాస్మోడియం వొవెల్ వంటి నాలుగు రకాల కేసులు ఉన్నాయి. వీటిలో నెల్లూరు జిల్లాలో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సిపారమ్ కేసులు నమోదవుతున్నాయి. వీటిని గుర్తించడానికి రక్తనమూనాలను సేకరించి మైక్రోస్కోప్, ఆర్డీటీ (రాపిడ్ డయాగ్నొస్టిక్ టెస్ట్) పరీక్షలు చేస్తారు. అయితే జిల్లా ప్రభుత్వాస్పత్రుల్లో జ్వరాలతో వచ్చిన వారికి ఇలాంటి పరీక్షలు చేయకుండానే మందులు రాసిస్తున్నారు.

డేంజర్ ఫాల్సిపారమ్

దోమ కాటు వల్ల మనిషిలో చేరిన ప్లాస్మోడియంలో ఫాల్సిపారమ్ అనే రకం ప్రమాదకరంగా మారుతోంది. ఆ జబ్బును నివారించేందుకు క్వినైన్ రకం ఖరీదైన మందులు వాడాలి. అయితే ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ మలేరియా జబ్బులకు వినియోగించే లారియాగో (క్లోరోక్విన్) వంటి మందులు మాత్రమే వాడుతున్నారు. వీటితో ఫాల్సిపారమ్ మలేరియా తగ్గదు. రక్తంలో ఉండే మలేరియా జీవులను వైద్యం ద్వారా చంపినప్పటికీ జబ్బు ఆగదు. లివర్‌లో ఉండే ఫాల్సిపారమ్ మలేరియా జీవులను చంపాలంటే ప్రైమాక్విన్ వంటి క్వినైన్ మందులు వాడాలి.

మలేరియాలో ప్రధాన లక్షణాలు

ఏ రకం మలేరియా వచ్చినా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం వస్తూ పోతుంటుంది. చలి, వణుకు వస్తాయి. మూత్రం ఎర్రగా వస్తుంది. లివర్‌లో ఉండే స్ప్లీన్‌లో కామెర్లు వస్తాయి. తలనొప్పి వస్తుంది. ఆకలి మందగిస్తుంది.

మలేరియా, డెంగీలపై అప్రమత్తత అవసరం

కొడవలూరు: మలేరియా, డెంగీ వ్యాధులు ప్రాణాంతకమైనందున అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఎం.రామకృష్ణ సూచించారు. కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక దర్గా సంఘంలో శుక్రవారం మలేరియా, డెంగీ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ దోమల కారణంగా ఈ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దోమలను నివారించుకోవడం ద్వారా ఆ వ్యాధుల బారిన పడకుండా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఏఎన్‌ఎం సుభాషిణి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.



కొడవలూరులో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఒకే కేసంట!

జిల్లాలో మలేరియా కేసుల పరిస్థితిపై వైద్యాధికారులను ప్రశ్నించగా జనవరి నుంచి ఇప్పటి వరకు ఒకే కేసు నమోదైనట్లు చెబుతున్నారు. డెంగీ కేసులు 23 మాత్రమే నమోదయ్యాయట. వాస్తవానికి ప్రైవేట్ ఆస్పత్రుల్లో మలేరియాతో పాటు వందలాది డెంగీ కేసులు నమోదయ్యాయి. అయితే స్ట్రిప్ పద్ధతిలో డెంగీ నిర్ధారణను వైద్యశాఖ పరిగణనలోకి తీసుకోదట. ఆత్మకూరు జిల్లా ఆస్పత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆస్పత్రులు, నెల్లూరులోని పెద్దాస్పత్రిలో మాత్రమే ఎలీసా పద్ధతిలో పరీక్షలు చేయించుకుని నిర్ధారణ అయితే డెంగీ ఉన్నట్టు నిర్ధారిస్తామని వైద్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

దోమల నివారణతోనే మలేరియాకు చెక్



దోమల ఉత్పత్తి జరగకుండా, అవి మనుషులను కుట్టకుండా చూసుకుంటే వాటి ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులను అరికట్టవచ్చు.అందుకు మలేరియా వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. దోమ తెరలు వాడాలి. ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్ శ్రీనునాయక్, రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, నెల్లూరు

మలేరియా ప్రబలకుండా ప్రత్యేక చర్యలు



డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆధ్వర్యంలో మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. ప్రజలను చైతన్యం చేస్తూ ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని చెబుతున్నాం. నీటి గుంతల్లో దోమలు వృద్ధి చెందకుండా వాటి లార్వా (గుడ్లు)ను తినే గంబూసియా చేపలను వదులుతున్నాం. ప్రజలు కిటికీలకు దోమ తెరలు వినియోగించాలి.

– హుస్సేనమ్మ, జిల్లా మలేరియా నివారణాధికారి

ప్రతిష్టాత్మకంగా రొట్టెల పండగ

- రూ.3.5 కోట్ల ఖర్చుతో సౌకర్యాల కల్పన
- అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు

నెల్లూరు (బారకాసు): బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఈ నెల 17 నుంచి 5 రోజుల పాటు రొట్టెల పండగ జరగనుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

రూ.3.5 కోట్లతో సౌకర్యాలు

మరో ఐదు రోజుల్లో రొట్టెల పండగ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర పాలక సంస్థ రూ.3.5 కోట్ల అంచనాలతో ప్రణాళికలు రూపొందించారు. ఈ పండగకు జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా భక్తులు వస్తారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ట చర్యలు చేపడుతున్నారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో 12 తాగునీటి స్టాల్స్, మహిళలు, పురుషులకు వేర్వేరుగా 177 మొబైల్ టాయిలెట్స్, స్నానపు గదులు, బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, మరుగుదొడ్లు, వర్షం వచ్చినప్పుడు తడవకుండా ఉండేందుకు ప్రాంగణంలో వాటర్ ప్రూఫ్ జింక్ షీట్లతో షెడ్లు ఏర్పాటు చేశారు.

పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలతో నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దాదాపు 14 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. నగరంలోని పాత టీబీహాస్పిటల్, సైన్స్ పార్కు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణం (బాలుర వసతిగృహం వెనుక), వైఎంసీఏ క్రీడా మైదానం, ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని వేణుగోపాలస్వామి కళాశాల ప్రాంగణం, పాత సీవీరామన్ స్కూల్ ప్రాంగణం, జొన్నవాడకు వెళ్లే దారిలోని డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ ముందు వైపు, డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ వెనుక వైపు ఉన్న ఖాళీ ప్రాంగణం, కస్తూరిదేవి స్కూల్ ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ స్థలం, పొదలకూరురోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం, వీఆర్సీ క్రీడామైదానం, డీకేడబ్ల్యూ కళాశాల ప్రాంగణం, కస్తూర్బా గార్డెన్ వెనుక వైపు ఉన్న ప్రాంగణం, ప్రసారభారతి (ఆకాశవాణి) రేడియో కేంద్ర సమీపంలోని ప్రాంగణంతో పాటు మరింత పార్కింగ్ కోసం అవసరం మేరకు పోలీసు అధికారులు సూచించే మరి కొన్ని ప్రాంగణాల్లో పార్కింగ్ స్థలాలు కేటాయించనున్నారు.



రొట్టెలు వదులుకునే స్వర్ణాల ఘాట్‌లో సిద్ధం చేస్తున్న ఏర్పాట్లు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

బారాషహీద్ దర్గా ప్రాంగణంతో పాటు సమీప ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మూడు షిఫ్ట్‌ల్లో పనిచేసే విధంగా 5 వేల మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. నిరంతరం పారిశుధ్య కార్మికులు పని చేయనున్నారు. స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద మోటార్లతో వాటర్ ప్యూర్‌పై చేసే పనులు చేపట్టనున్నారు.

విద్యుత్ సౌకర్యం ఏర్పాటు

బారాషహీద్ దర్గా ప్రాంగణంతో పాటు కేవీఆర్ పెట్రోల్ బంక్, బట్వాడిపాళెం సెంటర్, పొదలకూరోడ్డు కూడలి వరకు పట్టపగలు ఉండేలా రోడ్డుకిరు వైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు. వీఐపీ రిసెప్షన్ కోసం ప్రత్యేకంగా టెంట్ ఏర్పాటు, అన్నదానానికి మరో రెండు టెంట్లు వేయనున్నారు. ప్రత్యేకంగా పోలీస్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోంది. దర్గా ప్రాంగణంలో దాదాపు 40 సీసీ కెమెరాలు, పార్కింగ్ స్థలాలో కూడా 26 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పోలీస్ కంట్రోల్ విభాగానికి అనుసంధానం చేస్తారు.

రొట్టెల పండగకు అన్ని ఏర్పాట్లు



బారాషహీద్ దర్గాలో నిర్వహించనున్న రొట్టెల పండగకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పగడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకోసం అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాం. దాదాపు రూ.3.5 కోట్లు ఖర్చు అయ్యే అవకాశం ఉందని అంచనా వేశాం. ఐదు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది. ఇందు కోసం ఇప్పటి నుంచే నిత్యం అధికారులతో దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లుపై సమీక్షిస్తున్నాం.

– ఆనంద్, కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్, నగర పాలక సంస్థ

ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్ల పర్యవేక్షణ

- అదనపు కమిషనర్ శర్మద



మాట్లాడుతున్న ఏడీసీ శర్మద

నెల్లూరు (బారకాసు): బారాషహీద్ దర్గా రొట్టెల పండగ నిర్వహణను ఎవరికి కేటాయించిన బాధ్యతలను వారు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులకు అదనపు కమిషనర్ శర్మద సూచించారు. రొట్టెల పండగ నిర్వహణపై కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. శర్మద మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి ఐదు రోజుల పాటు పండగ జరిగే దర్గా ప్రాంగణంలో మంచినీటి సదుపాయం, హైమాక్స్ విద్యుత్ లైట్లు, తాత్కాలిక అంతర్గత దారుల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, బ్లీచింగ్, సున్నం, మొబైల్ టాయిలెట్లు, మైక్ అనౌన్స్‌మెంట్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు, సీసీ కెమెరాలు, పార్కింగ్ ఏర్పాట్లు, ఘాట్ ప్రాంతంలో షవర్ల ఏర్పాటు, దుకాణాల మార్కింగ్, రూట్ మ్యాప్‌ల ప్రదర్శన, బ్యారికేడ్ల నిర్మాణం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రొట్టెల పండగ నిర్వహణలో దర్గా కమిటీ ప్రతినిధులను సమన్వయం చేసుకుని అన్ని సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, సిటీ ప్లానర్ దేవీకుమారి, మేనేజర్ ఇనాయతుల్లా, శానిటేషన్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

పీకేపాడు ఇసుక రీచ్‌లో మైనింగ్ ఏడీ తనిఖీ



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ

సాక్షి ఎఫెక్ట్..

సోమశిల: ఇసుక అక్రమ రవాణాపై 'రీచ్‌లను పీల్చి పిప్పి చేస్తూ..' అనే శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి మైనింగ్‌శాఖాధికారులు స్పందించారు. మండలంలోని పడమటికంభంపాడు ఇసుక రీచ్‌ను జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌పై పర్యవేక్షణను పోలీస్, రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామన్నారు. ఇక మీదట అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రీచ్‌కు వెళ్లకుండా మార్గానికి అడ్డుగా కందకాలు తవ్వుతామని తెలిపారు. అనంతసాగరం రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల మేరకు ఉదయం రీచ్‌కు వచ్చి చూసే సరికి ఎటువంటి వాహనాలు లేవన్నారు. రీచ్ వద్ద ఇద్దరు స్పెషల్ ఫోర్స్‌కు చెందిన పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట మైనింగ్ సిబ్బంది, సోమశిల ఎస్సై సుబ్బారావు ఉన్నారు.

రేపు జిల్లా బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఇందుకూరుపేటలో ఆగస్టు 2, 3, 4, తేదీల్లో జరిగే పముజుల శ్రీనివాసులు, మహాలక్ష్మి మెమోరియల్ 11వ ఆంధ్రరాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలకు మహిళలు, పురుషుల జట్ల ఎంపికలు ఈ నెల 14వ తేదీ నిర్వహించనున్నట్లు పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి విజయ్‌కుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇందుకూరుపేట ఎంకేఆర్ హైస్కూల్ మైదానంలో జరుగుతాయన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు పురుషులు (85 కేజీల విభాగం), మహిళలు (75 కేజీల విభాగం) తమ ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు.


బారాషహీద్ దర్గా


రొట్టెలు కాలుస్తున్న మహిళ


దర్గాలో భక్తులు



స్వర్ణాలకు జనకళ



నెల్లూరుకు రొట్టెల పండగ కళ వచ్చింది. ఈనెల 17వ తేదీ నుంచి అధికారికంగా ఇది మొదలవుతుంది. ఇప్పటికే యంత్రాంగం ఏర్పాట్లను ప్రారంభించింది. దుకాణాలు పెడుతున్నారు. వీఐపీల కోసం భారీ టెంట్లు వేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి అప్పుడే జనం వచ్చి స్వర్ణాల చెరువు వద్ద సందడి చేస్తున్నారు. రొట్టెలను మార్చుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


చెరువులో జలకాలాడుతూ..


సిద్ధమైన ఎగ్జిబిషన్


దర్గా వద్ద ఏర్పాటు చేస్తున్న దుకాణాలు


వైద్య శిబిరాల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు




రొట్టెలు మార్చుకుంటూ..


భక్తుల కోసం చేసిన ఏర్పాట్లు

క్లుప్తంగా

ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ప్రతిభ


శ్రావణ్ కుమార్

బిట్రగుంట: ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఇందులో బోగోలు మండలం సిద్దవరపు వెంకటేశ్వరపాళేనికి చెందిన కట్టిపల్లి శ్రావణ్ కుమార్ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. అతను కెమికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రస్తుతం చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు సివిల్స్‌కు సన్నద్ధమవుతూ ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో రెండో ర్యాంకు సాధించారు.

రెండు కార్లు ఢీ

పొదలకూరు: పట్టణానికి సమీపంలో నెల్లూరు మార్గంలో శుక్రవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి నెల్లూరుకు కారు వెళ్తోంది. దీనిని నెల్లూరు నుంచి పొదలకూరుకు వస్తున్న కారు వేగంగా ఢీకొంది. దీంతో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. ఢీకొన్న కారు రోడ్డు పక్కన బోల్తా పడింది. ఒకరు గాయపడగా స్థానిక సీహెచ్‌సీకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలు దాటుతుండగా..

నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన శుక్రవారం నెల్లూరులో జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. రంగనాయకులపేట రైల్వే గేటు వద్ద గుర్తుతెలియని వృద్ధుడు చెన్నై వైపు వెళ్లే పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగా యాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. పింక్ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, వైట్, బ్లూ చారలు కలిగిన లుంగీ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వృద్ధుడి మృతదేహం


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

తీవ్ర గాయాలు

గుర్తుతెలియని వృద్ధుడు గురువారం సౌత్ రైల్వేస్టేషన్ వద్ద నెల్లూరు వైపు వచ్చే పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలవడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుడి వయసు 50 నుంచి 55 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. రైల్వే ఎస్సై మాలకొండయ్య శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చిన్నారిపై లైంగికదాడి కేసులో వ్యక్తికి పదేళ్ల శిక్ష

నెల్లూరు(లీగల్): ఐదేళ్ల చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించి లైంగికదాడికి పాల్పడ్డాడని నమోదైన కేసులో బుచ్చిరెడ్డిపాళెం మండలం రాఘవరెడ్డికాలనీ ప్రాంతానికి చెందిన గంగపట్నం కుమార్ అనే వ్యక్తికి శిక్ష పడింది. పదేళ్ల జైలు, రూ.25 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా (పోక్సో) కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఓ మహిళ బుచ్చిరెడ్డిపాళెంలో నివాసం ఉంటోంది. పనికి వెళ్లే సమయంలో తన కుమార్తెను పక్కింట్లో వదిలేది. ఈ నేపథ్యంలో 2017 సంవత్సరం జనవరి 22వ తేదీ రాత్రి కుమార్ చిన్నారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. మరుసటిరోజు సాయంత్రం గుర్తించిన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి కుమార్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దువ్వూరు శైలజారెడ్డి కేసు వాదించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

• రూ.24,700 స్వాధీనం

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు శివారులో గురువారం రాత్రి ఎస్సై రామకృష్ణ పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.24,700 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేకాట స్థావరాల సమాచారం అందజేసే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేస్తారని, వాటి కోసం దరఖాస్తు చేసుకోవాలని పట్టణంలోని కార్మిక శాఖ ఆస్పత్రి డాక్టర్ ఎస్.రూపేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీడీ కార్మికులు, సున్నపురాయి, ఐరన్‌ఓర్, మైకా కార్మికుల పిల్లలకు 2024 – 25 విద్యా సంవత్సరానికి గానూ ఉపకార వేతనాలు అందజేయనున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఇవి వర్తిస్తాయన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న వారు ఆగస్ట్ 31వ తేదీలోపు, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న వారు అక్టోబర్ 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు 040 – 29561297 ఫోన్ నంబర్‌ను, లేదా పట్టణంలోని కార్మి క శాఖ డిస్పెన్సరీ అధికారులను సంప్రదించాలని సూచించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	127
లేయర్ (లైవ్) :	110
బ్రాయిలర్ చికెన్ :	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	256
లేయర్ చికెన్ :	187

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.55
సన్నవి :	రూ.40
పండ్లు :	రూ.30

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు ఐదేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): ఓ వ్యక్తి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆమెపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ కేసుకు సంబంధించి నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ అదనపు స్పెషల్ కోర్టు జిల్లా జడ్జి జి.గీత శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మనుబోలు మండలం కొండుపాళెం గ్రామానికి చెందిన ఇందూరుపల్లి చిన హజరత్తయ్యకు రాజేశ్వరితో వివాహం జరిగింది. హజరత్తయ్య మద్యానికి బానిసయ్యాడు. భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. రాజేశ్వరి ప్రవర్తనపై నిందితుడు అనుమానం పెంచుకున్నాడు. మద్యం తాగినప్పుడు ఆమెను కొట్టేవాడు. ఈ నేపథ్యంలో 2015 సంవత్సరం ఆగస్ట్ 16వ తేదీ రాత్రి మద్యం తాగిన హజరత్తయ్య రాజేశ్వరిని దుర్భాషలాడుతూ కత్తితో ఆమె తలపై, ముఖం మీద పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. మరుసటిరోజు బాధితురాలు మనుబోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీవీ ప్రసాద్ వాదించారు.


చిరునామా అడుగుతున్నట్లు నటించి..

• వృద్ధురాలి బంగారు సరుడు చోరీ

ఆత్మకూరు: చిరునామా అడుగుతున్నట్లు నటిస్తూ వృద్ధురాలి మెడలోని బంగారు సరుడును ఓ వ్యక్తి తెంపుకెళ్లిన ఘటన ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం జరిగింది. ఎస్సై కె.ముత్యాలరావు కథనం మేరకు.. పట్టణంలోని తిప్పపై ఆవుల సిద్ధమ్మ అనే వృద్ధురాలు నివాసం ఉంటోంది. ఆమె ఇంటి ఆవరణను శుభ్రం చేస్తుండగా ఓ వ్యక్తి మోటార్‌బైక్‌పై వచ్చి కృష్ణమందిరానికి ఎటెళ్లాలని అడిగాడు. సిద్ధమ్మ చెబుతుండగా అతను ఆమె మెడలోని రెండు సవర్ల బంగారు సరుడును తెంపుకెళ్లాడు. బాధితురాలు కేకలు వేయగా సమీపంలోని వారు వచ్చేసరికి అతను పరారయ్యాడు. సిద్ధమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోళ్ల వ్యర్థాల లారీ స్వాధీనం

సంగం: కోళ్ల వ్యర్థాలను లారీలో తరలిస్తుండగా ఎస్సై నాగార్జునరెడ్డి, మత్స్యశాఖ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని దువ్వూరు, అరవపాళెంతోపాటు వంగల్లు, ర్యాంపు తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో చేపల గుంతలున్నాయి. వీటిలో కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. దీనికి సంబంధించి ముందస్తుగా అందిన సమాచారం మేరకు దువ్వూరు – అరవపాళెం సమీపంలో కోళ్ల వ్యర్థాల లారీని ఎస్సై పట్టుకున్నారు. అందులో 23 డ్రమ్ముల్లో వ్యర్థాలను గుర్తించారు. వాటిని సంగం కొండ దిగువ అటవీ ప్రాంతంలో భారీ గొయ్యి తీసి అందులో


లారీ వద్ద ఎస్సై, మత్స్యశాఖ సిబ్బంది

పోశారు. మండలంలో ఎక్కడైనా కోళ్ల వ్యర్థాలు ఉపయోగించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాగార్జునరెడ్డి హెచ్చరించారు.